క్లుప్తంగా

మహిళా చైతన్యంతో సమాజంలో మార్పు



ఆత్మకూరు : మహిళలు చైతన్యవంతులైతేనే సమాజంలో మార్పు మొదలవుతుందని సర్వోదయ సంస్థ కోఆర్డినేటర్ చాపర్తి రవీందర్ అన్నారు. మండలంలోని గుడెప్పాడ్ గ్రామంలో మంగళవారం స్వయం సహాయక సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. సర్వోదయ సంస్థ మూడు దశాబ్దాలుగా మహిళా సాధికారత కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య బాధ్యులు అరుణ, సాగర్, వనజ, సఖి కౌన్సిలర్ విజయలక్ష్మి, కేస్ వర్కర్ భారతి, ఏఎస్ఎం ఉమా, అంగన్‌వాడీ టీచర్ సునీత పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



ఎల్కతుర్తి : భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 15,16వ తేదీల్లో హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించతలపెట్టిన జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా నాయకుడు మనోజ్ పిలుపునిచ్చారు. మంగళవారం భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరులో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు, కవులు, కళాకారులు, మేధావులు మహాసభలకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఉత్తమ గురువులకు సన్మానం



ఐనవోలు : గురు పూజోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఉత్తమ గురువులుగా 14 మంది ఎంపికయ్యారు. కాగా మంగళవారం ఎమ్మార్సీ భవనంలో ఉత్తమ గురువులను మండల విద్యాశాఖ అధికారి పులి ఆనందం సన్మానించారు. ఐనవోలు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, గెజిటెడ్ హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, మధుకర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మండల ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత



వేలేరు : మండల కేంద్రం నుంచి కొత్తకొండ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో గల ఎల్లమ్మ వాగుపై నిర్మిస్తున్న వంతెన, బీటీ రోడ్డు నిర్మాణం కొన్నేళ్లుగా పూర్తికాలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ దారి వెంట గుంతలు ఏర్పడగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గమనించిన స్థానిక ఎస్సై సురేష్ గుంతల్లో మట్టి పోయించి పూడ్చి వేయించారు. అలాగే రోడ్డుకిరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో పలువురు వాహనదారులు ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కమలాపూర్ : యువత మత్తు పదర్థాలకు దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సూచించారు. మండలంలోని మర్రిపల్లిగూడెంలో మంగళవారం రాత్రి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు జాగృతి పోలీస్ కళాబృందంతో కళాజాత నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో యువత గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, గంజాయి, డ్రగ్స్, గుట్కా అమ్మినా, సేవించినా 8712584473 నంబరుకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాబృందం ఇన్‌చార్జ్ మహిళా ఏఎస్సై నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు పట్టించుకోరా..?

- గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం
- మూలకుపడిన ఫాగింగ్ యంత్రం
- దోమల స్వైరవిహారం
- పెరుగుతున్న జ్వరపీడితుల సంఖ్య



భీమదేవరపల్లిలో పేరుకుపోయిన మురుగునీరు

ఎల్కతుర్తి : ప్రస్తుత వర్షాకాలంతో విష జ్వరాలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. భీమదేవరపల్లి మండలంలో జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రత్యేక అధికారుల పాలనలో దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లోని ప్రధాన రోడ్లతో పాటు వార్డుల్లో, అంతర్గత రోడ్లలో వర్షపు నీరు చేరడంతో దోమలకు నిలయంగా మారుతుందని, అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహిస్తున్నారు. దోమకాటు వల్ల జ్వరాల బారిన పడుతున్నామని పలువురు ఆందోళన చెందుతున్నారు. మురుగు కాల్వల్లో ఎబేట్ ద్రావణం కానీ, బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతీ ఏడాది వర్షాకాలంలో ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణకు చర్యలు చేపట్టేవారని, ప్రస్తుతం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జ్వర పీడితుల్లో చిన్నారులే అధికంగా ఉండడంతో స్థానికులు ఆందోళనకు చెందుతున్నారు.

మూలకుపడ్డా ఫాగింగ్ యంత్రాలు..

పలు పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రత్యేక అధికారుల పాలనలో వాటిని వినియోగించడం లేదనే స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీల్లో నిధుల లేమితో అధికారులు వాటిని మూలకుపడేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కేంద్రంపై ఆరోపణలు హాస్యాస్పదం



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్కతుర్తి : రైతులకు సరిపడా యూరియా అందించడం లేదని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ నేతలు ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై, భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ఎల్కతుర్తి-సిద్దిపేట ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులకు యూరియా ఇవ్వడం లేదని కాంగ్రెస్ నాయకులు బదనాం చేస్తూ పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు 10లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని సిఫారసు చేస్తే కేంద్ర ప్రభుత్వం 11లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందించిందని, అయినా మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం హేయమైన చర్య అన్నారు. యూరియా బస్తాలు కాంగ్రెస్ నాయకుల ఇళ్లలో మరిగిపోతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా అసత్య ప్రచారం మానుకోవాలని హితవుపలికారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని నాయకులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్, పైడిపెల్లి పృథ్వీరాజ్, సదానందం, కిష్టయ్య, నిషాంత్, రాజేందర్, వీరన్న, భాస్కర్, రమేశ్, ప్రవీణ్, వెంకటేష్, శ్రీవర్ధన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఏఎస్సై కుమారస్వామి



మాట్లాడుతున్న ఏఎస్సై కుమారస్వామి

శాయంపేట : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు పంపించిన లింకు మెస్సెజ్‌లను ఓపెన్ చేయవద్దని ఏఎస్సై కుమారస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో వాలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక అవగాహన కార్యక్రమానికి విడ్స్ కౌన్సిలర్ క్రాంతికుమార్ అధ్యక్షత వహించగా ఏఎస్సై కుమారస్వామి హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరికీ క్రమశిక్షణ ఎంత అవసరమో సైబర్ నేరాలపై ముందు జాగ్రత్త అంతే అవసరమని అన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాల కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని అన్నారు. బహుమతులు గెలుచుకున్నారని, లోన్ యాప్స్ క్లిక్ చేయమని సైబర్ నేరాగాళ్లు మాయమాటలు చెప్పి అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు వివరాలు, ఓటీపీలు, లింక్‌లు ఓపెన్ చేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అలాగే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా ఆరోగ్య బీమా, ప్రమాద బీమాలను పొంది కుటుంబానికి రక్షణ కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మసాగర్ : మండల కేంద్రం శివారులో పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అరెస్టైన వారిలో మండల కేంద్రానికి చెందిన రోండి శ్రీను, ఆవుల కుమారస్వామి, ఓర్సు శ్రీనివాస్, వల్లెపు రాజు, బొడ్డు జయధీర్, సాయిపేటకు చెందిన బోడపట్ల రంజిత్, మడికొండకు చెందిన ఎత్తిరి రాజు ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి పేకముక్కలు లక్ష18వేల400 నగదు, 4 ద్విచక్ర వాహనాలు, 7 ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు స్థానిక పోలీసులు మంగళవారం తెలిపారు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గట్లనర్సింగాపూర్ గ్రామ శివారులో పేకాడుతున్నారనే సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.2వేలు నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కమలాపూర్ : మండలంలోని గూడూరు శివారులో పేకాడుతున్న ఐదుగురుని పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. గూడూరు శివారులోని మాదాడి శ్రీరాంరెడ్డి కోళ్ల ఫారం వద్ద పేకాడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి కమలాపూర్ పోలీసులు దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.22,500 నగదు, ఐదు సెల్ ఫోన్లు, ప్లేయింగ్ కార్డులు, స్కోర్ షీట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చదరంగంతో ఆలోచన సామర్థ్యం పెంపుదల

- ఎంఈఓ రామ్‌ధన్



చదరంగం ఆడుతున్న విద్యార్థులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి చదరంగం పోటీలు విజయవంతంగా ముగిసినట్లు ఎంఈఓ రామ్‌ధన్ తెలిపారు. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి జూనియర్ విభాగంలో 16 మంది విద్యార్థిని విద్యార్థులు, సీనియర్ విభాగంలో 64 మంది విద్యార్థిని, విద్యార్థులు మొత్తం 80 మంది పాల్గొన్నారని అన్నారు. చదరంగం మన మేథో సామర్థ్యాన్ని, ఆలోచన విధానాన్ని పెంపొందించే క్రీడా అన్నారు. చదరంగం వల్ల ఆలోచన, సృజనాత్మకత పెంపొందుతాయని అన్నారు. ఈ పోటీలకు చీఫ్ ఆర్బిటర్‌గా రజనీకాంత్, ఆర్బిటర్, కోఆరినేటర్‌గా అయిత శ్రీనివాస్ వ్యవహరించగా వ్యాయామ ఉపాధ్యాయులు మైసయ్య, శైలేందర్ సింగ్, రమేశ్, సురేష్, శ్రీనాథ్, ప్రసన్న, అమృత సమన్వయకర్తలు వ్యవహరించినట్లు తెలిపారు. ఈ పోటీలకు పొన్నాల రామయ్య, మామిడాల వెంకట్రాజములు ప్యాట్రన్స్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. పాట్రన్స్, వ్యాయామ ఉపాధ్యాయుల చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందించినట్లు ఆయన తెలిపారు.

ఉపాధి హామీ కూలీలకు ఈకేవైసీ హాజరు



ఈకేవైసీని పరిశీలిస్తున్న ఏపీఎం కుమారస్వామి

ఎల్కతుర్తి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నకిలీ హాజరుకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈకేవైసీ హాజరు విధానాన్ని అమలు చేస్తుంది. మంగళవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధి హామీ కూలీల ఈకేవైసీ హాజరు ప్రక్రియను ఏపీఓ కుమారస్వామి పరిశీలించారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 8,394 జాబ్ కార్డులు, 16,164 కూలీలు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం 5,668 జాబ్ కార్డులు సంబంధించిన 9,114 కూలీలు మాత్రమే పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఉపాధి హామీ పనులకు వస్తున్న కూలీల హాజరును నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈకేవైసీ హాజరు విధానంతో పనిచేసిన కూలీలకే లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఈ పద్ధతి ప్రకారం పనులకు వచ్చిన వెంటనే కూలీల ఫొటోలు తీసి అప్లోడ్ చేస్తామని, నాలుగు గంటల తర్వాత మరోసారి ఫొటో తీసి అప్లోడ్ చేయడం ద్వారా ఒకే వ్యక్తి ఈ రెండు ఫొటోల్లో ఉంటేనే వేతనాలు మంజూరు అవుతాయని అన్నారు. మండలంలోని ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో ఈనెల 30వరకు ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఏపీఓ తెలిపారు.

బాలల భద్రతకే ‘వెలుగు ప్రయాణం’



మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు : బాలల భద్రత, శ్రేయస్సు కోసమే వెలుగు ప్రయాణం అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో సంస్కార్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, కడియం ఫౌండేషన్ సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులకు సురక్షిత స్పర్శ, పోక్సో చట్టం, ఇంటర్నెట్ వినియోగం, మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. సంస్థ స్థాపకులు గణేశ్, మహిమ, గజల్, రాజశేఖర్, సాయికిరణ్, దీక్షిత్‌ను అభినందించారు. హెచ్ఎం సదానందం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మోహన్, అశోక్, పూర్ణచందర్, విద్యాసాగర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలల అక్రమ రవాణాను నిర్మూలించాలి

ఖిలా వరంగల్ : బాలల అక్రమ రవాణా నిర్మూలనకు పాటుపడాలని యాంటీ హ్యూమన్, ట్రాఫికింగ్ పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్ భాగ్యలక్ష్మి సూచించారు. మంగళవారం రంగశాయిపేటలోని లిటిల్ లారెన్స్ హైస్కూల్‌లో సాంఘిక సేవా సమితి కోఆర్డినేటర్ సుదర్శన్ ఆధ్వర్యంలో మానవ, బాలల అక్రమరవాణా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు అప్రమత్తమై అపరిచితులపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు క్లీన్

సాక్షి ఎఫెక్ట్..



డంపింగ్‌యార్డును శుభ్రం చేస్తున్న సిబ్బంది

శాయంపేట : మండల కేంద్రంలోని డంపింగ్ యార్డు నిరుపయోగంగా ఉండడంతో మందుబాబులకు అడ్డగా మారిన విషయం తెలిసిందే. కాగా సాక్షి దినపత్రికలో ‘చెత్త కుప్పలు..జనాల తిప్పలు’ అనే శీర్షికన సోమవారం కథనం ప్రచురితమైంది. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ మంగళవారం గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ సిబ్బందితో మండల కేంద్రంలోని డంపింగ్ యార్డ్‌ను శుభ్రం చేయించారు. అందులోకి మందుబాబులు వెళ్లకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

పాఠశాలల్లో ఉత్సాహంగా కళా ఉత్సవ్



ధర్మసాగర్ : నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ఎల్కతుర్తిలో..

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని టీచింగ్, లెర్నింగ్ సెంటర్ భవనంలో మంగళవారం నిర్వహించిన కళా ఉత్సవ్ ఉత్సాహంగా సాగింది. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కళా ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఈ పోటీలకు తెలుగు ఉపాధ్యాయురాలు ఆర్ఎన్ ఉమాదేవి, సంగీత ఉపాధ్యాయురాలు ఎస్. హేమారాణి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. మండల విద్యాధికారి డాక్టర్ రామ్‌ధన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కళా ఉత్సవాన్ని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ధర్మ ప్రకాశ్, ఉపాధ్యాయ బృందం పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేసింది. సోలో శాస్త్రీయ నృత్యం విభాగంలో దక్షరెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, బృంద నృత్యంలో లాస్య, రేణుక, మధుప్రియ, రిత్విక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ధర్మసాగర్, కథ, కథనంలో మౌనిక కేజీబీవీ ఎంపికైనట్లు ఎంఈఓ వెల్లడించారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆరు అంశాల్లో విద్యార్థులకు కళా ఉత్సవ పోటీలను మంగళవారం నిర్వహించారు. మండల విద్యాధికారి సత్యనారాయణ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు మండలస్థాయి కళా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఓకల్ మ్యూజిక్ గ్రూప్, డాన్స్ సోలో, విజువల్ ఆర్ట్స్ సోలో, డాన్స్ గ్రూప్, ట్రెడిషనల్ స్టోరీ, టెల్లింగ్ గ్రూప్ పోటీల్లో 53మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటినట్లు తెలిపారు. విజేతలకు ఈనెల 12న జిల్లాస్థాయి జరిగే కళా ఉత్సవ్ పోటీలకు హాజరుకావాలని తెలిపారు. అలాగే భీమదేవరపల్లి మండలం ముల్కనూరు మోడల్ స్కూల్‌లో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ఆటాపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్ రెహమాన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాణి పాల్గొన్నారు.

ఐనవోలు : విద్యార్థుల్లో దాగిఉన్న కలను వెలికితీసేందుకే మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి కళా ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పులి ఆనందం తెలిపారు. మంగళవారం మండలస్థాయిలో కళా ఉత్సవ్ నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. లోకల్ మ్యూజిక్ క్లాసికల్ సోలోలో వైష్ణవి (జెడ్పీహెచ్ఎస్ వెంకటాపూర్), డ్యాన్స్ సోలో క్లాసికల్‌లో కావిక (కేజీబీవీ, ఐనవోలు), జానపద బృంద నృత్యంలో శ్రీజ, టీం (జెడ్పీహెచ్ఎస్, పంథిని), రోల్ ప్లేలో చరిష్మా, టీం (కేజీబీవీ, ఐనవోలు), డ్రాయింగ్‌లో హిందుప్రియ (జెడ్పీహెచ్ఎస్, పంథిని). విజువల్ ఆర్ట్స్, లోకల్ క్రాఫ్ట్స్‌లో అభిరామ్ (జెడ్పీహెచ్ఎస్, పంథిని), సంప్రదాయ కథలలో ఐశ్వర్య (జెడ్పీహెచ్ఎస్, పంథిని) విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందించినట్లు పేర్కొన్నారు. కక్కిరాలపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ నారాయణరావు జయంతి



ఆత్మకూరు : కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ అనిత



నడికూడలో..



వేలేరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల పాఠశాలల్లో మంగళవారం కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాళోజీ సేవలను కొనియాడారు. ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనితతో పాటు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల, సోషల్ వేల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో మంగళవారం కాళోజీ జయంతి, మాండలిక భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజేపీ పాఠశాలలో విద్యార్థులకు తెలుగులో పద్య పఠనం, జానపద పాటలు, దేశభక్తి గేయాల పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రేవతి బహుమతులు అందించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ విమల కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీఓ విద్యావతి, టీఏ స్వప్న, దర్శన్, నవీన్ కుమార్, రాజేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.


పరకాల : ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతిని మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలల్లో అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

వేలేరు : మండలంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హెచ్.కోమి కాళోజీ చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. నాయబ్ తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ సురేందర్, సీనియర్ అసిస్టెంట్ హేమనాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నక్షా ప్రకారమే చెరువు కట్ట పనులు చేపట్టాలి

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామంలో గల పెద్దచెరువుకట్ట నిర్మాణ పనులను నక్షా ప్రకారం చేపట్టాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, మైలారం మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. చెరువుకట్ట పనులు చేపడుతుండగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అడ్డుకుని పనులను ఇష్టం వచ్చిన విధంగా మార్పు చేస్తున్నాడని ఆరోపించారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. కట్టపై బీటి రోడ్డు పనులకు రూ.కోటి60లక్షల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. కానీ కాంట్రాక్టర్‌ను ఇబ్బందులకు గురిచేయడంతో పనులు ఆగిపోయాయని ఆరోపించారు. స్వలాభం కోసం కట్టను చెరువు వైపు 200 మీటర్ల పొడవు, చెరువు లోపల 13 ఫీట్ల వెడల్పుతో కట్టను వదిలేసి దళితులకు సంబంధించిన గోరీలను కూల్చి భూమిని ఆక్రమించుకుని ఆయకట్ట రైతులకు దారి లేకుండా చేశారని ఆరోపించారు. పెద్దచెరువు కట్ట పనులు నక్షా ప్రకారం చేపట్టాలని, లేని పక్షంలో భారీ వర్షాలు కురిస్తే దళిత కాలనీ ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి నక్షా ప్రకారమే పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, సాంబరెడ్డి, సదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సుమన్, భాస్కర్, శంకర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల క్యూ



ఆత్మకూరు : మండల కేంద్రంలోని సొసైటీకి మంగళవారం 15 టన్నుల యూరియా రావడంతో రైతులు పెద్దెత్తున తరలి వచ్చారు. ఒక రైతుకు రెండు బస్తాల యూరియా పంపిణీ చేశామని, రెండు రోజుల్లో మరో 20 టన్నుల యూరియా వస్తుందని రైతులందరికీ సరఫరా చేస్తామని సొసైటీ సీఈఓ ఓమ్‌రెడ్డి తెలిపారు. కాగా ఎస్సై తిరుపతి బందోబస్తు నిర్వహించారు.

శాయంపేట : మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో మంగళవారం పెద్దకోడెపాక గ్రామ రైతులకు ఎరువుల బస్తాల పంపిణీలో జాప్యం జరిగింది. దీంతో రైతులు ఉదయం 8 గంటల నుంచి పడిగాపులుగాస్తూ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఎండలో గేటు బయట ఉంచి ఒక్కొక్క రైతుకు టోకెన్‌లు జారీ చేయడంతో రైతులు గుమిగూడారు.